# థాంక్యూ సుజా!



**పులిపాక కనకదుర్గ**

**పిల్లల్ని నిద్రపుచ్చి గదిలో కొచ్చింది సుజాత.**

**దీర్ఘాలోచనలో ఉన్నాడు ప్రకాష్.**

**"ఏంటి ఇంకా అదే ఆలోచిస్తున్నారా?" భర్త పక్కనే కుర్చుంటూ అడిగింది.**

**"ప్రస్తుతం సమస్య అదే అయినప్పుడు దాని గురించి కాక ఇంక దేని గురించి ఆలోచిస్తాను. అవునూ పిల్లలు నిద్ర పోయారా?"**

"వాళ్ళు నిద్రపోయారుగానీ పది దాటింది మీరు కూడా పడుకోండి. ఎక్కువసేపు ఆలోచిస్తూ మేలుకుని ఉంటే ఆరోగ్యం పాడవుతుంది" దుప్పట్లు సరిచేస్తూ అంది సుజాత.

పడుకున్నాక ప్రేమగా భార్యని దగ్గరకు తీసుకున్నాడు ప్రకాష్.

సుజాత, ప్రకాష్‌లది ముచ్చటైన దాంపత్యం. ఇద్దరు పిల్లలు. అబ్బాయికి ఎనిమిదేళ్ళు, పాపకి ఆరేళ్ళు. ప్రకాష్ ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. రెండు గదుల అద్దె ఇంటిలో గుట్టుగా కాపురం చేస్తున్నారు. జీతం తక్కువైనా ఉన్నంతలో సంతోషంగా ఉంటారు. అయితే ఈ మధ్యన ప్రకాష్ పనిచేస్తున్న కంపెనీ నష్టాల్లో కూరుకుపోయింది. జీతాలు సరిగ్గా ఇవ్వటం లేదు. అంతేకాదు, ఏ క్షణాన అయినా ఉద్యోగం పోయే ప్రమాదం పొంచి ఉందని గ్రహించాడు ప్రకాష్. అందుకే ముందుగానే వేరే ఉద్యోగం వెతుక్కోవాలనే ఆలోచనలో ఉన్నాడు.

ఉదయానే లేచి పేపర్లో వాంటెడ్ కాలంలో తనకు అర్హత ఉందనుకున్న చోటల్లా పెన్‌తో మార్క్ చేస్తున్నాడు ప్రకాష్.

"ఏమిటి గంటనించి పేపర్ ముందేసుకుని కూర్చున్నారు? ఆఫీసుకు వెళ్ళరా?" కాఫీ గ్లాసుతో వచ్చిన సుజాత అడిగింది.

"హాఫ్ డే సి ఎల్ పెట్టి మధ్యాహ్నం ఓ ఇంటర్వ్యూకి వెళదామనుకుంటున్నాను"

"ఎందుకండీ అప్పుడే ఉద్యోగం పోయినట్లు కష్టపడతారు?" నిష్ఠూరంగా అంది సుజాత.

"కష్టపడకూడదనే సుజా ఇంతగా తాపత్రయ పడుతోంది. తప్పదు. జీతాలే ఇవ్వలేకపోతున్న కంపెనీ మూతపడక తప్పదు. ముందుగానే మేల్కొని వేరే దారి చూసుకోకపోతే కష్టాలు పడక తప్పదు" వేదనగా అన్నాడు ప్రకాష్.

కఠోరంగా ఉన్నా సత్యాన్ని అంగీకరించక తప్పలేదు సుజాతకు.

"సరే స్నానం కానివ్వండి, బయలుదేరుదురు గాని" అక్కడి నుంచి కదులుతూ అంది.

సాయంత్రానికి మొహం వేలాడేసుకుని వచ్చాడు ప్రకాష్.

"ఏం జరిగింది అలా ఉన్నారు?" ప్రకాష్ మూడ్‌ని గమనించి మృదువుగా అడిగింది సుజాత.

"ఏముంది, వెళ్ళిన పని అవ్వలేదు" కుర్చీలో కూలబడుతూ అన్నాడు ప్రకాష్.

"అదేం?"

"అదేం అంటే ఏం చెప్పను? ఉద్యోగానికి నా క్వాలిఫికేషన్ సరిపోదన్నారు"

"ఇంతలోనే ముగిసిపోయిందేమీ లేదు. ధైర్యంగా ఉండండి. కష్టపడేవాళ్ళకు ఇది కాకపోతే మరొకటి" ధైర్యం చెప్తూ అంది.

సుజాత వెళ్ళిన వేపు అభిమానంగా చూశాడు ప్రకాష్.

సుజాత గొప్పదనం అదే. కష్టాలకు అధైర్యపడే తత్వం కాదు తనది.

ఆ సాయంత్రం ఎప్పట్లానే ప్రకాష్ పిల్లలకు చదువు చెప్తుంటే, సుజాత ఇంటి పనిలో బీజీగా ఉంది.

"దేవుడా! ఉన్నంతలో తృప్తిగా బతుకుతున్నాం, ఈ ఆనందాన్ని దూరం చేయకు" మౌనంగా ప్రార్థించింది సుజాత.

మరో పది రోజులు యాంత్రికంగా గడిచిపోయాయి.

మరో రెండు, మూడు ఇంటర్వ్యూలకి వెళ్ళొచ్చాడు. ఏ ప్రయత్నమూ సఫలం కాలేదు. ఆ రోజు సుజాత మేనమామ చుట్టపు చూపుగా వచ్చాడు. ఆడపిల్లలు లేని ఆయనకు సుజాత అంటే ప్రాణం. సుజాత కుటుంబ పరిస్థితి తెలుసుకుని విచారం వ్యక్తం చేశాడు.

"ఏమ్మా సుజాతా! నాకో ఉత్తరం ముక్క రాసి పడెయ్యవచ్చు కదా?" మెత్తగా కోపగించుకున్నాడు.

"సంసారం గుట్టు అని మీ పెద్దలే కదా మావయ్యా చెప్పింది" తల వంచుకుని చెప్పింది. సుజాత తత్వం చిన్నతనం నుంచి తెలుసు ఆయనకు. అందుకే తనకు తెలిసిన ఛార్టెడ్ అకౌంటెంట్ రెఫరెన్స్ ఇచ్చి వెళ్ళాడు.

అదే రోజు వెళ్ళి ఆయనను కలుసుకున్నాడు ప్రకాష్.


"ఏమయ్యిందండీ? కాయా? పండా?" ప్రకాష్ రాగానే ఆత్రంగా అడిగింది సుజాత.

"రెండూ కాదు" నిరాశగా అన్నాడు ప్రకాష్.

"అదేమిటి?" ఆశ్చర్యంగా అంది సుజాత.

"జీతం చాలా తక్కువ. చేసినా, చెయ్యక పోయినా ఒకటే"

పొంచి వున్న పెనుముప్పు ముంచుకొచ్చింది. ప్రకాష్ పనిచేస్తున్న కంపెనీ లే ఆఫ్ ప్రకటించింది.



## నిరీక్షణ

నా కళ్ళలో
కళ్లాపి జల్లి
నీ కోసం వేచియున్నాను
నా నవ్వులు ముగ్గులుగా
రంగులేసుకున్నాయి
నా మనోభావాలు
విహంగాలయి
నా గడపలో వేచియున్నాయి
నీ నిర్ణయపు పాదాన్ని
గడపలో మోపి
ఆవిష్కరణ చేస్తావో
వీధి దాటి
అపరిష్కృతంగా మిగుల్తావో
నీ ఇష్టం! నీ ఇష్టం!

– శైలూషి

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టయ్యింది ప్రకాష్ పరిస్థితి.

❊ ❊ ❊

"అంత దూరం వెళ్ళొద్దండి. మిమ్మల్ని విడిచి నేనూ, పిల్లలు ఉండలేము. ఇక్కడే ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుందాం" దిగులుగా అంది సుజాత.

"అలా అంటే ఎలా చెప్పు సుజా? పరిస్థితులు అన్నీ నీకు తెలుసు. వ్యాపారం చేసే డబ్బే మన దగ్గర ఉంటే ఈ బాధలన్నీ ఎందుకు చెప్పు? మనకా ముందూ వెనకా ఆస్తులేవీ లేవు. వయసులో ఉండగా కష్టపడకపోతే పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించావా?" ప్రకాష్ నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

"అవన్నీ నాకు తెలియదు. మీరు లేకుండా ఈ సంసారాన్ని నెట్టుకు రాలేనండీ"

"సముద్రంలో పడ్డవాడికి ఈత అదే వస్తుంది. ఇలాంటి అవకాశం తప్పిపోతే మళ్ళీ మనకు రాదు. అవకాశం వచ్చినప్పుడే అంది పుచ్చుకోవాలి. ఎంత? రెండేళ్ళు కష్టపడితే, తరువాత అందరం కలిసి ఉండొచ్చు" ధైర్యం చెప్తూ అన్నాడు ప్రకాష్.

ప్రకాష్‌కు ఎరిగినవాళ్ళ ద్వారా దుబాయ్‌కు వెళ్ళే అవకాశం వచ్చింది. ఉద్యోగ ప్రయత్నాల్లో విసిగివేసారిన ప్రకాష్‌కు ఈ అవకాశం ఎడారిలో ఒయాసిస్సులా కనిపించింది. కానీ సుజాతే ప్రకాష్‌ని విడిచి ఉండటానికి అసలు అంగీకరించటం లేదు.

సుజాత భయం సుజాతది. సుజాత ఫ్రెండ్ లీలక్కూడా ఇదే పరిస్థితి ఎదురయ్యింది. లీల భర్త కూడా దుబాయ్‌కు వెళ్ళాడు. మగ దిక్కు లేక ఇల్లంతా అస్తవ్యస్తమయ్యింది. అందుకే వీలయినంతవరకు భర్తను ఇక్కడే ఉంచాలని సుజాత ప్రయత్నం.

ప్రకాష్‌కు అంతా తెలుసు. కానీ, గత్యంతరం లేదు. అతికష్టం మీద సుజాతను ఒప్పించగలిగాడు ప్రకాష్.

కన్నీళ్ళతోనే ప్రకాష్‌కు వీడ్కోలు చెప్పింది సుజాత. అతికష్టం మీద రెండు నెలలు గడిచాయి.

పెరట్లో ఒక్కతే కూర్చునుంది సుజాత. కాలం ఇంత సుదీర్ఘమైందని ఇప్పుడే అనుభవంలోకి వచ్చింది. ప్రకాష్ లేని లోటు కొట్టొచ్చినట్లు తెలుస్తోంది. ప్రకాష్ బాధ్యతాయుతమైన ప్రవర్తన, ఏకాంతంలో అతని చిలిపితనం అన్నీ గుర్తుకొస్తూ ఒంటరితనాన్ని మరింత వేదనాభరితం చేస్తున్నాయి.

"మమ్మీ మాథ్స్ అర్థం కావటం లేదు కొంచెం చెప్పవూ" చేతిలో పుస్తకంతో వచ్చాడు బాబు.

పుస్తకం తీసుకుని చూసింది సుజాత. ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. సుజాత ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. పద్దెనిమిదేళ్ళకే పెళ్ళయి వెంట వెంటనే ఇద్దరు పిల్లల తల్లయ్యింది. తను చదివిన చదువు నాలుగో క్లాసు లెక్కలు చెప్పటానికి కూడా పనికి రాదా? నిస్పృహగా అనుకుంది సుజాత.

"మమ్మీ! అన్నయ్యకు మార్కులు తక్కువొచ్చాయని క్లాసు బయట ఎండలో నిలబెట్టారు" అప్పుడే వచ్చిన పాప చెప్పింది. గుండె గుభేలుమంది సుజాతకు.

రాత్రి చాలాసేపు మేలుకునే ఉంది. "తన కొడుకు కూడా లీల కొడుకులాగే చదువు అబ్బక జూలాయిలా తయారవుతాడా? ప్రకాష్ పంపించే డబ్బు బొటాబొటిగా సరిపోతోంది. ట్యూషన్ పెట్టించే స్తోమత లేదు. ఇప్పుడెలా? ప్రకాష్ ధ్యాసలో పిల్లల్ని సరిగ్గా పట్టించుకోవటం లేదు. పోనీ ఇప్పుడు పట్టించుకుందామన్నా ఇంగ్లీష్ మీడియం సిలబస్ తనకు అసలు కొరుకుడు పడటం లేదు. తనదసలే తెలుగు మీడియం చదువాయే" పరిపరివిధాలుగా పోయింది సుజాత అంతరంగం.

ఓ నిర్ణయం తీసుకున్నాక మూగన్నుగా నిద్రపట్టింది సుజాతకు.

మర్నాడు తెల్లవారుజామున నాలుగు గంటలకే మేలుకొంది. కొడుకు బ్యాగ్‌లోంచి పుస్తకాలు తీసింది. పక్కనే డిక్షనరీ, హైస్కూల్ ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలను కూడా పెట్టుకుంది. తదేక దీక్షతో చదవటం మొదలుపెట్టింది. దేనికైనా మీనింగ్ తెలియకపోతే డిక్షనరీ రిఫర్ చేసుకుంది. లెక్కల దగ్గరకు వచ్చేసరికే వచ్చింది చిక్కంతా. ఓ పట్టాన అర్థం కాలేదు. ఏం చేయాలో అర్థం కాలేదు. యధాలాపంగా పేజీలు తిప్పసాగింది. ఉన్నట్టుండి ఓ చోట ఆగిపోయింది సుజాత దృష్టి. అక్కడ వర్కవుట్ చేసిన ఎగ్జాంపుల్ లెక్కలు ఉన్నాయి. మార్గం సుగమమయ్యింది సుజాతకు.

నెల రోజులు గడిచేసరికి పిల్లలకు అర్థంగాని



**ఇటీవల చెన్నై కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ గ్రూప్ ఫంక్షన్లో మాజీ భారత చీఫ్ ఎలక్షన్ కమీషనర్ శ్రీ టి.ఎస్. కృష్ణమూర్తిగారిని సన్మానించి, జ్ఞాపికను బహూకరిస్తున్న క్లబ్ అధ్యక్షులు శ్రీ ఆర్. గాంధీ. వేదికపై శ్రీయుతులు జస్టిస్ టి.ఎన్. వల్లినాయగం, అధ్యక్షులు బి.బి.రావు, గౌరవ కార్యదర్శి కె. గజపతిగార్లను చూడవచ్చు.**

పాఠాలు చెప్పగలుగుతోంది సుజాత. క్రమంగా సాయంకాలాలు పిల్లల్ని దగ్గరుండి చదివించటం అలవాటు చేసుకుంది.

విజ్ఞానతృష్ణ గొప్పది. అది మొదలవటమే కష్టం. ఒకసారి మొదలయ్యిందంటే ఆ దాహార్తికి అంతు ఉండదు. సుజాతకు ఇప్పుడు పుస్తక పఠనానికి ఎంతసేపూ చాలటం లేదు. రూపాయికే వస్తోందని ఇంగ్లీష్ పేపరు తెప్పించుకుంటోంది. ప్రకాష్ ఆబ్సెన్స్‌తో అస్తవ్యస్తమైన పిల్లల చదువులు ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాయి.

ప్రైవేట్‌గా బి.ఏ. రాయాలని నిర్ణయించుకుంది సుజాత.

మధ్యాహ్నం పక్కింటి ప్రవీణ వచ్చింది. మొన్ననే డిగ్రీ పూర్తి చేసిందా అమ్మాయి. సుజాతను అక్కా అని పిలుస్తుంది. తనతో మాట్లాడటంవల్ల బోలెడు విషయాలు తెలిశాయి సుజాతకు. తను కూడా ప్రవీణ మార్గంలోనే వెళ్ళాలనుకుంది.

మర్నాడు పండక్కి చీర కొనుక్కుందామని దాచిన డబ్బుతో కావాల్సిన మెటీరియల్ కొనుక్కుని తెచ్చుకుంది.

ఇప్పుడు సుజాత ధ్యేయం ఒకటే. ఎలాగైనా అనుకున్నది సాధించటం. అందుకోసం అహర్నిశలు పరిశ్రమిస్తోంది.

ఆ రోజు –

"మమ్మీ మాకు ప్రేయర్ పాడటం చెప్పవూ" స్కూలు నుంచి రాగానే సుజాత దగ్గరకు వచ్చి అడిగారు పిల్లలిద్దరూ.

"ఇప్పుడా అవసరం ఏమొచ్చింది?" ఆశ్చర్యంగా అంది సుజాత.

"మమ్మీ క్లాస్ ఫస్ట్ వచ్చినవాళ్ళు ఫ్రైడే అసెంబ్లీలో ప్రేయర్ పాడాలి. ఈ ఫ్రైడే మేమే ప్రేయర్ చెప్పాలి" అల్లరిగా నవ్వుతూ అన్నారా గడుగ్గాయిలు.

వాళ్ళ చేతుల్లో ఫస్ట్ ఇన్ క్లాస్ బ్యాడ్జీలను చూసి ఆనందంతో కళ్ళు చెమర్చాయి సుజాతకు.

పిల్లల్ని దగ్గరకు తీసుకుని బుగ్గల మీద గట్టిగా ముద్దుపెట్టుకుంది.

"మమ్మీ మంచిది" పిల్లలు కూడా తల్లి బుగ్గల మీద ముద్దు పెట్టుకుని బయటకు పరుగెత్తారు ఆడుకోటానికి.

నవ్వుకుంది సుజాత.

"ప్రకాష్ వియ్ ఆర్ మిస్సింగ్ యూ" ఆర్తిగా అనుకుంది సుజాత. చూస్తుండగానే ఏడాదిన్నర గడిచిపోయింది.

నెల రోజుల సెలవు మీద ఇండియాకొచ్చాడు ప్రకాష్. కానీ, కనీసం మరో రెండేళ్ళు దుబాయ్‌లోనే ఉండాల్సిన అవసరం ఉందని అతని అభిప్రాయం.

సుజాత ఆనందానికి అవధులు లేవు.

పిల్లలిద్దరూ "డాడీ" అంటూ చుట్టేశారు.

ప్రకాష్ మట్టుకు బాగా చిక్కిపోయాడు. దుబాయ్‌లో ఉన్నా మనసు ఇండియాలోనే ఉంది. ఇల్లూ, పిల్లలూ ఎలా ఉన్నారో అని ఒకటే దిగులు.

"డాడీ! అన్నయ్యా, నేను క్లాస్ ఫస్ట్ తెలుసా?" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పింది పాప.

"డాడీ ఇది నేను క్విజ్‌లో గెలుచుకున్న షీల్డ్" గర్వంగా చూపించాడు బాబు.

చూస్తున్నదంతా నమ్మలేకపోతున్నాడు ప్రకాష్. "సుజాత ఉత్త అమాయకురాలు. భర్త చాటు భార్య. పెద్దగా చదువుకోలేదు. కానీ ఇంటిని ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. పిల్లలిద్దరూ జెమ్స్‌లా తయారయ్యారు" అనుకోకుండా ఉండలేకపోయాడు ప్రకాష్.

"డాడీ ఈ రోజే కదా వచ్చింది. రేపు చెబ్దురుగానీ అన్నాలు తిని పడుకోండి" పిల్లల్ని నెమ్మదిగా నచ్చచెప్పి తీసుకెళ్ళింది సుజాత.

పిల్లలు పడుకున్నాక గదిలోకొచ్చింది సుజాత. తెల్లని ప్రింటెడ్ షిఫాన్ చీరలో, జడలో జాజులతో మనోహరంగా ఉంది సుజాత.

"ఏయ్ దొంగా ఎంత అందంగా ఉన్నావో తెలుసా? ఇన్నాళ్ళూ నిన్ను మిస్సయ్యాను" భార్యని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు ప్రకాష్.

"మీరు మాత్రం చిక్కిపోయారు తెలుసా?" కన్నీళ్ళతో అంది సుజాత.

"నెల రోజులు ఇక్కడే ఉంటాగా ఇంక లావవుతాలే" లాలనగా అన్నాడు ప్రకాష్.

"నెల రోజులు ఉండటమేమిటి? మీరెక్కడికీ వెళ్ళటం లేదు, ఇక్కడే ఉంటున్నారు"

"ఇలా మాట్లాడే కోపం తెప్పించొద్దు. ఇక్కడే ఉంటే డబ్బెలా వస్తుంది? ఎడాదిన్నర కష్టపడితే యాభై వేలు కూడా జమకాలేదు" చిరాకుగా అన్నాడు ప్రకాష్.

మాట్లాడకుండా దిండు కింద నుంచి ఓ కవర్ తీసి భర్త చేతిలో పెట్టింది సుజాత. ఇదివరకే చించి వున్న కవర్లోంచి ఓ కాగితాన్ని బయటకు తీశాడు. చదువుతున్న ప్రకాష్‌లో ఆనందాశ్చర్యాలు ముప్పిరిగొన్నాయి.

"ఇదంతా నిజమా? ఎలా సాధ్యపడింది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరెళ్ళిన తరువాత నాకు అన్నీ సమస్యలే ఎదురయ్యాయి. పిల్లలకు చదువు కూడా చెప్పలేకపోయాను. ఓ పక్క మీరు లేరని బాధ. మరో పక్క పిల్లలు వెనకబడిపోతున్నారని దిగులు. మా కోసం కష్టపడుతున్న మిమ్మల్ని మరింత బాధపెట్టడం ఇష్టం లేకపోయింది. అందుకే పట్టుదలగా బాబు పుస్తకాలు తీసి చదవటం మొదలుపెట్టాను. మొదట్లో కష్టంగా అనిపించింది. డిక్షనరీ ముందు పెట్టుకున్నాను. లెక్కలు అర్థం కాలేదు. ఎగ్జాంపుల్స్ చూసి అర్థం చేసుకున్నాను. అలా చదువు మీద ఆసక్తి పెరిగింది" వెన్నెల రాత్రి నిశ్శబ్దంలో వీణ మీటినట్లు వినిపించింది సుజాత స్వరం.

"అది సరే ఈ అపాయిట్‌మెంట్ ఆర్డరు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ప్రకాష్.

"ఓ రోజు పక్కింటి ప్రవీణ వచ్చింది. మాటల సందర్భంలో తను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్నానని చెప్పింది. దానికి ఇంటర్మీడియట్ క్వాలిఫికేషన్ సరిపోతుందని చెప్పింది. నేనూ అప్లయి చేశాను. పట్టుదలగా ప్రిపేర్ అయ్యాను. చదువుకునే టప్పుడు నేర్చుకున్న టైపింగ్ ఇప్పుడు అక్కరకు వచ్చింది. జస్ట్ మీరొచ్చేముందే అపాయింట్‌మెంట్ లెటరొచ్చింది. పోస్టింగ్ ఇక్కడే ఇచ్చారు. ఇంక మీరు ఎక్కడికీ వెళ్ళనక్కర్లేదు. ఆ యాభైవేలు పెట్టి ఏదైనా వ్యాపారం చేయండి" మంద్రంగా పలికింది సుజాత స్వరం.

"సుజా యాభై వేలు ఏ మూలకి? వ్యాపారం అంటే నీకేం తెలుసు?"

"చూడండీ ఏ వ్యాపారానికైనా కావల్సింది హార్డ్ వర్కు, కమిట్‌మెంట్, సిన్సియారిటీ అవన్నీ మీలో పుష్కలంగా ఉన్నాయి. అన్నింటికన్నా ముఖ్యంగా దానిమీద రాబడికోసం మీరు కావలసినంత టైము తీసుకోవచ్చు. ఎందుకంటే ఇప్పుడు కుటుంబ బాధ్యతల కోసం మీకు చేదోడుగా నా ఉద్యోగం ఉంది. అన్నింటికీ మించి మిమ్మల్ని మేము విడిచి ఉండలేము. పిల్లలకు మనిద్దరి ప్రేమా కావాలి. అలాగే వాళ్ళ ముద్దుముచ్చట్లని మనిద్దరం కలిసి ఎంజాయ్ చేయాలి."

సంతోషాన్ని వ్యక్తం చేయటానికి మాటలు చాలలేదు ప్రకాష్‌కు.

"థాంక్యూ సుజా" లైట్స్ ఆఫ్ చేస్తూ అన్నాడు ప్రకాష్.